


కరీంనగర్ నుంచే బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం





- 12న ఎస్సారార్ కళాశాల మైదానంలో బహిరంగ సభ
- హాజరు కానున్న కేసీఆర్
- కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్
- పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్ పేర్ల ప్రకటన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ కరీంనగర్ నుంచే శంఖం పూరించనున్నది. తన సెంటిమెంట్ జిల్లా అయిన కరీంనగర్ నుంచే ఈసారి కూడా ప్రచారం ప్రారంభిస్తే శుభం జరుగుతుందని భావించిన కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ నేతలతో జరిగిన సమావేశంలో వెల్లడించారు. కరీంనగర్ నుంచి రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించారు. వినోద్‌కుమార్ ఇప్పటికే నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ నేతల ముఖ్య శ్రేణుల సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సమాయత్తం చేస్తు కార్యాచరణను వారిముందు ఉంచారు. పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పుడుఅధికారికంగా ఆయన పేరును ప్రకటించారు. వినోద్‌కుమార్ కరీంనగర్ అభ్యర్థిగానే ఇప్ప టికే ప్రచారం జరుగుతుండగా, పెద్దపల్లి నియోజక వర్గ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పేరును ఇప్పుడు ఖరారు చేశారు.

● ఎస్సారార్ కళాశాల మైదానం నుంచి ప్రచారానికి శ్రీకారం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 12న ఎస్సారార్ కళాశాల మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొనడం ద్వారా లోక్ సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన నియోజక వర్గ నేతలతో ఆయన చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ సభకు కరీంనగర్, పెద్దపల్లి నియోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా చూడాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మండల స్థాయిలో పార్టీ నేతల సమావేశాలు ఏర్పాటు చేయాలని, బస్సు యాత్రలు నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలను నిర్వహించాలని నిర్ణయించారు. రోడ్ షోలలో తాను పాల్గొంటానని కేసీఆర్ నేతలకు హామీ ఇచ్చారని సమాచారం.

● బోయినపల్లి వినోద్‌కుమార్ 2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా ఎంపిక చేయించారు. జాతీయ రహదారులు, కొత్తపల్లి మనోహ రాబాద్ రైలు మార్గ నిర్మాణ పనులు చేపట్టించడానికి ఆయన ఎంపీగా కృషి చేశారు. 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ చేతిలో పరాజయం పాలయ్యారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెన్నంటి ఉండి వినోద్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జాతీయ స్థాయిలో వివిధ పార్టీల మద్దతు కూడగట్టడంలో క్రియాశీల పాత్ర నిర్వహించారు. 2004లో హన్మకొండ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఎంపీగా గెలుపొందిన వినోద్‌కుమార్ ఉద్యమ కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు 2008 మార్చి3న కేసీఆర్‌తో కలిసి ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఉద్యమ కాలంలో ప్రతి కీలక ఘట్టంలోనూ కేసీఆర్‌కు అండగా నిలుస్తూ వచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సలహాలు ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో క్రియాశీల పాత్ర నిర్వహించి బీఆర్ఎస్‌లో ముఖ్య నేతగా ఎదిగారు. ఈ క్రమమే ఆయనను మళ్లీ ఇప్పుడు అభ్యర్థిగా ఎంపిక చేయడానికి కారణమైంది.

● పెద్దపల్లి నియోజక వర్గ ఎంపీగా ఉన్న బోర్లకుంట వెంకటేశ్ నేత ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక్కడ నుంచి మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోటీలో దింపుతారని భావించారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ పార్టీ అధినేత ఈశ్వర్‌ను తెరపైకి తెచ్చారు. ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గ ఎమ్మెల్యేగా గెలుపొందే వరకు ఈశ్వర్ గోదావరిఖనిలో కార్మిక నాయకుడిగా ఉండే వారు. ఆయనకు రామగుండం నియోజక వర్గంతో పాటు మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గాల్లో కార్మికులతో సత్సంబంధాలు ఉన్నాయి. ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా మంత్రిగా పట్టు సాధించుకున్న ఆయనకు నేరుగా పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని రామగుండం మంచిర్యాల, బెల్లంపల్లి చెన్నూరు, ధర్మపురి నియోజక వర్గాల్లో కార్మిక నేతగా సంబంధాలు ఉన్న వ్యక్తిగా లోక్ సభ అభ్యర్థిగా పోటీలోకి దిగనున్నారు. మంథని, పెద్దపల్లి నియోజక వర్గాలు కూడా ఈ పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోనే ఉన్నాయి. కొప్పుల ఈశ్వర్‌ను రంగంలోకి దింపడం ద్వారా బలమైన పోటీ ఇవ్వవచ్చని బీఆర్ఎస్ నాయకత్వం భావించి స్థానికుడైన ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు భావిస్తున్నారు.



వేడెక్కుతున్న రాజకీయాలు

- 7న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- వేములవాడలో బహిరంగ సభ
- 12న కరీంనగర్‌లో కేసీఆర్ సభ
- కొనసాగుతున్న బీజేపీ ప్రజాహిత యాత్ర

5లో..

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర పేరుతో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈనెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వేములవాడలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పటిలాగే కరీంనగర్ నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. 12న ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పర్యటనలు రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

మూడు నెలలుగా అందని వేతనాలు

ఇబ్బందుల్లో పంచాయతీ కార్మికులు



సుందరగిరిలో పారిశుధ్యపనులు చేస్తున్న కార్మికులు(ఫైల్)

చిగురుమామిడి,మార్చి 3: మండలంలో 17 గ్రామ పంచాయతీ కార్మికులు ఉన్నారు. ఈ పంచాయతీల్లో 92 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరందరూ మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా రాకపోవడంతో వేతనాలు ఇవ్వలేదని మాజీ సర్పంచ్‌లు అంటున్నారు. అరకొరగా వచ్చిన నిధులు విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులకే సరిపోయేవి. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందిగా ఉన్నది..

- వెల్పుల ప్రశాంత్, మూదిమాణిక్యం



గ్రామంలో ఉన్న అనేక రకాల పారిశుద్ధ పనులు చేస్తూ ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే ఉంటాం. మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. మా గోడును పట్టించుకునే నాథుడు లేడు. ఇప్పటికైనా అధికారులు జీతాలు ఇచ్చి ఆదుకోవాలి.

మా బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదు..

- చెల్పూరి శంకర్, ఇందుర్తి



మూడు నెలలుగా జీతాలు లేవు. తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ఎవ్వరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు వెంటనే జీతాలు ఇచ్చి ఆదుకోవాలి.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జడ్పీ చైర్ పర్సన్ కనమల్ల విజయ



పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కనమల్ల విజయ

సుభాష్‌నగర్, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జడ్పీ చైర్ పర్సన్ కనమల్ల విజయ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కలిసి ఆమె పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ తమ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మూడు రోజులపాటు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ సునీల్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియా, డీఐవో డాక్టర్ సాజిద, జిల్లా సంక్షేమ ఆధికారి సరస్వతి, డాక్టర్ నవీన, జిల్లా మాస్ మీడియా అధికారి రంగారెడ్డి పాల్గొన్నారు.

● పల్స్‌పోలియో విజయవంతం

పల్స్ పోలియో కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా 85,135 మంది (96.4 శాతం) పిల్లలకు పోలియో చుక్కలను వేయించారు. జిల్లాలో 545 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 150 అర్బన్ ఏరియాల్లో, 395 గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. 27 మొబైల్ టీం, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలను వేశారు. 217 హైరిస్కు పాయింట్లు, మైగ్రేట్ పాయింట్లను గుర్తించారు.

కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటా

రెండోసారి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన మోదీకి కృతజ్ఞతలు

- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



హుజూరాబాద్‌లో సెల్ఫీ దిగుతున్న బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, మార్చి 3: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు తాను రుణపడి ఉంటానని, వారు వేసిన ఓట్లతోనే తాను ఎంపీగా ఎన్నికయ్యానని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశానని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మళ్లీ తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్ పార్లమెంట్ అభివద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన చేపట్టిన ప్రజాహిత యాత్ర ఆదివారం హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను రెండోసారి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో గతంలో కంటే భారీ మెజార్టీతో విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటికి కోతలు పెడుతూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన 10 లక్షల మంది పేద కుటుంబాలకు ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. వాళ్లకు ఆరు గ్యారంటీలు రావన్నారు. రాష్ట్రంలో 90లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉంటే అందులో 40లక్షల మందికి మాత్రమే 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చినవి ఆరు గ్యారెంటీలు కాదు ఆరు మోసాలని ప్రజలకు అర్థమైందన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బోర్నపల్లిలో పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గంగిశెట్టి రాజు, పైళ్ల వెంకటరెడ్డి, బింగి కరుణాకర్, శశిధర్, వేణు, దేవేందర్, ప్రభాకర్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

● మోదీతోనే పేదవారికి న్యాయం

సైదాపూర్: చాయ్ అమ్ముకునే వ్యక్తి అయిన మోదీ ప్రధాని అయ్యాడు కాబట్టే దేశంలో పేదోళ్లకు న్యాయం జరుగుతున్నదని ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో భాగంగా మండలంలోని అమ్మనగుర్తి, బొమ్మకల్, రాయికల్, ఘనపూర్, సైదాపూర్, సోమారం, వెన్నంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయంటే అది మోదీ చలవేనన్నారు. కేసీఆర్ తెలంగాణను అప్పుల పాలు చేశాడని విమర్శించారు. నరేంద్ర మోదీ హయాంలో రాముడి గుడి కట్టారని తరతరాలుగా చెప్పుకుంటారన్నారు. 150 రోజులు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకొని పేద ప్రజల కోసం కొట్లాడినందుకు తనపై 100 కేసులు పెట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ జల్లా మల్లేష్, మాజీ సర్పంచ్ కేడీకే మధుకర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రావు, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ధర్మం కోసం... దేశం కోసం పనిచేసే యువత కావాలి...

శంకరపట్నం: యువత రోజులో ఒక గంట ధర్మం కోసం.. దేశం కోసం పేద ప్రజల కోసం పనిచేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రజాహిత యాత్రలో భాగంగా బండి సంజయ్ సైదాపూర్ మండలం నుంచి వీణవంక వెళ్లే క్రమంలో మండలంలోని మొలంగూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొలంగూర్ ఖిల్లా వద్ద దూద్‌బావిని పరిశీలించారు. అక్కడే భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నియోజకవర్గాలలో ప్రజాహిత యాత్ర పూర్తి చేశామన్నారు. ప్రజాహిత యాత్రకు ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందని, నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గెలిపిస్తాయన్నారు.

● ధర్మం కోసం పోరాడే పార్టీ బీజేపీ

వీణవంక: భారతీయ జనతా పార్టీ ధర్మం కోసం పోరాడే పార్టీ అని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా వీణవంక మండలంలోని వీణవంక చల్లూరు,ఎల్బాక గంగారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందార్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హిందూ ధర్మం కోసం పోరాడకపోతే తెలంగాణలో హిందువులు బొట్టు పెట్టుకుని తిరిగే పరిస్థితి ఉండేది కాదన్నారు. కేసీఆర్ పని పాట లేకుండా ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రామిడి ఆదిరెడ్డి, పెద్ది మాల్లారెడ్డి, చెన్నమాధవుని నర్సింహరాజు, పుప్పాల రఘు, శ్రీనివాస్‌రెడ్డి, బత్తిని నరేష్‌గౌడ్, రాజు, మారం తిరుపతిరెడ్డి, బొబ్బల విజయ్‌కుమార్, కంకల సంతోష్ పాల్గొన్నారు.



సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో ప్రజలను అభివాదం చేస్తున్న బండి సంజయ్

మల్లికార్జునస్వామి బోనాల జాతర



ఆత్మకూర్‌లో బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 3: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో యాదవులు మల్లికార్జున స్వామి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలోని స్వామి వారికి నిర్వహకులు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని నుంచి భక్తులు బారులు తీరారు. భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనం నెత్తిన ఎత్తుకొని యాదవులు, కురుమ సంఘం సభ్యుల ఒగ్గు డోలు వాయిద్యాలు, శివ సత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి బయలు దేరారు. అనంతరం బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 3: నగరంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకోగా వారి వద్ద గంజాయి పట్టుబడిందని ఒకటో టౌన్ ఎస్ఐ రవి ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ స్టేడియం వద్ద గన్నేరువరం గ్రామానికి చెందిన కొనగాని మధు, మాకొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన బల్ల వెంకటేష్ గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జీలుక వెంకటమ్మ(85) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటోంది. పైగా వృద్ధాప్యం తోడవడంతో జీవితంపై విరక్తి చెందిన శనివారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న చేదబావిలో దూకింది. ఆదివారం తెల్లవారుజామున వెంకటమ్మ శవమై తేలింది. మృతురాలి కుమారుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓంకార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె ఉంది.

ఒంటరితనంతో మహిళ..

గంగాధర, మార్చి 3: గంగాధర మండలం గట్టుబూత్కూర్‌కు చెందిన మహిళ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేరెళ్ల లక్ష్మి(46) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. లక్ష్మికి ఒక కూతురు కాగా కరీంనగర్‌కు చెందిన యువకుడితో వివాహం చేసింది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుండేది. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరితనం భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ తరలించారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

ధర్మపురి, మార్చి 3: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిసగోని వెంకటేష్ (29) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం జగిత్యాలకు వెళ్లిన వెంకటేష్ అక్కడే డ్రైవర్‌గా పని చేశాడు. మద్యానికి బానిసై అప్పుల పాలై స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో కూడా ఎలాంటి పనిచేయకుండా మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది ధర్మపురి పట్టణంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

జ్యోతినగర్, మార్చి 3: స్థానిక మల్యాపూర్ రోడ్డులోని ఎన్టీపీసీ కాలువలో పడి పిట్టల సురేష్(30) అనే యువకుడు మృతిచెందాడు. కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన సురేష్ ప్రమాదవశాత్తు కాలువ పడిపోయి చనిపోయాడు. సురేష్ ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు సమాచారం. కాలువలో పడిన సమయంలో ఫిట్స్ రావడంతో చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి బాయమ్మ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ హెడ్ కానిస్టేబుల్ ఎండీ ఖాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిట్టల సురేష్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి3: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ రేగుల భాస్కర్, యజమాని బుడిగే భీరయ్యపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వేడెక్కుతున్న రాజకీయాలు

- 7న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- వేములవాడలో బహిరంగ సభ
- 12న కరీంనగర్‌లో కేసీఆర్ సభ
- కొనసాగుతున్న బీజేపీ ప్రజాహిత యాత్ర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ స్థానాల్లో పోటీకి నిలపనున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి కాక ముందే అన్ని రాజకీయ పక్షాలు పార్టీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఏ పేరుతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసినా ప్రధాన ఎజెండా లోక్ సభ ఎన్నికలే. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేరును పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. పెద్దపల్లి లోక్ సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని నిలిపేది ఆ పార్టీల నాయకత్వం ఇంకా ప్రకటించలేదు.

● విస్తృతంగా నేతల పర్యటనలు..

బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన నియోజక వర్గ పరిధిలో ప్రజాహిత యాత్రను చేపట్టి మొదటి విడతను పూర్తి చేసుకుని రెండో విడత పర్యటిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ



నియోజక వర్గాల్లో 119 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రధాన గ్రామాల మీదుగా పట్టణాల మీదుగా ఆయన యాత్ర పూర్తి చేసుకుని ప్రస్తుతం హుస్నాబాద్, హుజురాబాద్ నియోజక వర్గాల్లో ప్రజాహిత యాత్ర కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం కాకున్నా ఈ నెల 7న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనుండడం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఆయన 7న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఎన్నికల సమయం కావడంతో ఈ బహిరంగసభ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. కరీంనగర్ లోక్ సభ నియోజక వర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ప్రజలు ఈ బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభగానే దీనిని భావిస్తున్నారు.

ఈ నెల 12న బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో శంఖారావ సభను నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ బహిరంగ సభలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులను ఆయన ఆదివారం ప్రకటించారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు ప్రతి కీలక సందర్భంలోనూ కరీంనగర్ ప్రధాన పాత్ర పోషిస్తు వస్తూ ట్రెండ్‌సెట్టర్ జిల్లాగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రాజకీయ వాతావరణం వేడెక్కడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

● రాళ్లవాగు కుడికాలువకు గండి పడ్డ ఫలితం ● అడుగంటిన బావులు, చుక్కనీరు రాని బోర్లు ● మరమ్మతుల కోసం రైతాంగం నిరీక్షణ ● రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో జాప్యం


భూషణరావుపేట శివారులో పంటల పొలంలో నెర్రెలుబారిన భూమి


నక్కల ఒర్రె వద్ద తెగిన రాళ్ళవాగు కుడికాలువ(ఫైల్)

కథలాపూర్, మార్చి 3: రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద సాగయ్యే పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో నీటి ఉధృతి కారణంగా కుడికాలువకు నక్కల ఒర్రె వద్ద గండి పడడంతో నీరంతా వాగులోకి వృధాగా పోతోంది. ఈ నేపథ్యంలో కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాయకులు గండిని పూడ్చడానికి నిధులు తెచ్చి మరమ్మతులు చేస్తారని ఆశించిన అన్నదాతకు కష్టకాలం వచ్చిపడింది. పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతుండడంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

● అన్నదాత ఆశలకు 'గండి'

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్ట్ వల్ల జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊటపల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందుతోంది. కుడి కాలువ సుమారు ఏడు కిలోమీటర్లు ఉండగా ఇందులో రెండు కిలోమీటర్లు కమ్మర్‌పల్లి ఇరిగేషన్ విభాగం పరిధిలో ఉంది. మిగిలిన భాగం జగిత్యాల జిల్లా ఇరిగేషన్ పరిధిలోకి వస్తుంది. గండి పడ్డ ప్రాంతం కమ్మర్‌పల్లి అధికారుల పరిధిలోకి వస్తున్న క్రమంలో అంచనాలు రూపొందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో కుడికాలువ పూర్తిగా జగిత్యాల జిల్లాకు మార్చాలని ఇప్పటికే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చించారు. పూర్తిస్థాయి అంచనాలు వేసి సత్వరమే నివేదిక పంపించాలని ఆదేశించారు. అయితే గండి పడ్డ ప్రాంతంలో మరమ్మతులు చేపడతారేమోననే ఆశతో రబీ సీజన్‌కు సంబంధించి వరి, మిర్చి, మినుము, నువ్వు పంటలు రైతులు సాగు చేసుకున్నారు. ఆ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో బావులు, బోర్లలో నీళ్ల అడుగంటి సుమారు 200 ఎకరాల మేర పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో రైతులు చేసిన లక్షలాది రూపాయల పెట్టుబడులు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది.

● మూడు ఎకరాల పొలం ఎండిపోయింది..

పచ్చిమట్ల శ్రీనివాస్, రైతు



రాళ్లవాగు కుడికాలువపై ఆధారపడి మూడెకరాల పొలం సాగు చేసుకున్నాను. కాలువ పక్కనే బావి ఉన్నందు వల్ల భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. అయితే వర్షాకాలం రోళ్లవాగు కాలువకు గండి పడి నీళ్లన్నీ వాగులోకి పడిపోతున్నాయి. దీంతో బావి పూర్తిగా అడుగంటింది. సుమారు రు. 40 వేలతో బావిలో పూడిక తీసినా ఫలితం కనిపించలేదు. లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది.

● ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల సమన్వయం

గడ్డం చిన్నారెడ్డి, రైతు



రెండు జిల్లాల ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నం చేయడం శుభపరిణామం. ఇప్పటిదాకా తరచూ తెగిపోతున్న కుడి కాలువకు శాశ్వత మరమ్మతులు చేయని కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచ రంగా మారింది. ఎమ్మెల్యే అసెంబ్లీలో రాళ్లవాగు మరమ్మతులపై ప్రస్తావించిన నేపథ్యంలో కుడి కాలువ మరమ్మతులకు నోచుకుంటుందని ఆశిస్తున్నాము.

బంగారు నగల బ్యాగ్ అప్పగింత


మహిళకు నగలను అందజేస్తున్న ఏసీపీ కృష్ణ, సీఐ

సుల్తానాబాద్, మార్చి 3: ఓ మహిళ తన బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోగా, పోలీసులు కొన్ని గంటల్లోనే ఆటోను గుర్తించి బ్యాగ్‌ను బాధిత మహిళకు అందించారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ వివరాల వెల్లడించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల వసంత తన తల్లిగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి వచ్చింది. తనకు చెందిన తొమ్మిది తులాల బంగారు నగల బ్యాగ్‌తో ఆదివారం సుగ్లాంపల్లి నుంచి ఆటోలో సుల్తానాబాద్‌కు వచ్చింది. బస్టాండ్‌లో కరీంనగర్ బస్సు ఎక్కే క్రమంలో బంగారు నగల బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. వెంటనే వసంత సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు గోదావరిఖని, కాల్వశ్రీరాంపూర్, కరీంనగర్, పెద్దపల్లి ప్రాంత పోలీసులను అప్రమత్తం చేసి ఆటోలను తనిఖీ చేయించారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి ఆటోను కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గుర్తించి తనిఖీ చేయగా నగల బ్యాగ్ లభ్యమైంది. దాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత మహిళ వసంతకు ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వినీత, అశోక్ రమేష్ తదితరులు అందజేశారు.

ఈతవనం దగ్ధం

కథలాపూర్, మార్చి 3: మండలంలోని తుర్తిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఈత వనం దగ్ధమైంది. 163 సర్వే నంబర్‌లో సుమారు 3.24 ఎకరాల్లో ఈతవనం ఉండగా స్థానిక గీతకార్మికులు కల్లు గీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈతవనం పూర్తిగా కాలిబూడిద కావడంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో తమకు దిక్కుతోచని పరిస్థితి దాపురించిందని బాధిత గీతకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన న్యూరో వైద్యుల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 3: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తు న్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో కిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రులకు చెందిన నిష్ణాతులైన న్యూరో సర్జన్లు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన న్యూరో డాక్టర్లు పాల్గొన్నారు. న్యూరో వైద్య చికిత్సలో వస్తు న్న అధునాతన పద్ధతులు, చికిత్స విధానాలు, అత్యాధునిక ఆపరేషన్ విధానాల గురించి వివరించారు. ముగింపు కార్య క్రమంలో డాక్టర్ ఏకే పురోహిత్ ప్రెసిడెన్షియల్ ఓరియంటేషన్ ను అందించారు. డాక్టర్ మానస్ పాణిగ్రహి, డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ ద్వారకానాథ్‌లు రెనే ఆసుపత్రిలో మెదడులో కంతి తొలగించడం, వెన్నుపాము అత్యాధునిక ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సదస్సును డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఏకే పురోహిత్

రుద్రవరం ఆలయాల్లో దొంగల బీభత్సం

వేములవాడ టౌన్, మార్చి 3: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని పలు ఆలయాల్లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయంలోకి చొరబడి గడ్డపారతో హుండీని పగలగొట్టి నగదును, శ్రీస్వామి వారి వెండి ఆభరణాలను అపహరించారు. హనుమాన్ ఆలయంలో సైతం తాళం పగలగొట్టి హుండీలోని నగదును అపహరించుకుపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రుద్రవరం గ్రామంలోని ఆలయాల్లో దొంగలు పడి హుండీల్లోని నగదును అపహరించుకు వెళ్లడం ఇది మూడోసారి కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురువుతున్నారని చెబుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బీజేపీ నాయకుడి మృతి

- పరిహారం చెల్లించాలని నాయకుల డిమాండ్

ఇల్లంతకుంట, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు రంగు రమేష్ (41) విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉండే రమేష్ ఉదయం స్నానం చేసి బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీస్‌స్టేషన్ ప్రహరీకి రమేష్ బట్టలు ఆరవేయడానికి ఇనుప వైరును కట్టుకున్నాడు. ప్రహరీ మీదుగా ఎల్‌టీ లైన్ వెలుతోంది. స్తంభానికి ఉన్న డెడ్‌ఎండ్ వైరు వల్ల విద్యుత్ ప్రసరణ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహానికి సిరిసిల్లలో పోస్టుమార్టమ్ నిర్వహించి ఇంటికి తీసుకువస్తుండగా బీజేపీ నాయకులు రహీంఖాన్‌పేట గ్రామానికి చేరుకొని వాహనాన్ని నిలిపివేశారు. రమేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డికి సమాచారం అందించారు. సెస్ డైరెక్టర్ చేరుకొని పోస్టుమార్టమ్ రిపోర్టు ఆధారంగా సెస్‌సంస్థ తరపున పరిహారం అందించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

కుటుంబీకులకు సెస్‌సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తనపరిధిలో లేనందున తగిన విదంగా అండగా ఉంటానని సెస్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బెంద్రం తిరుపతిరెడ్డి, నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం, దెశెట్టి శ్రీనివాస్, సాయగౌడ్, పున్ని రాజు, వజ్జపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


రమేష్ (ఫైల్)

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- 5కే రన్‌కు భారీ స్పందన
- మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ
- హాజరైన యువతీ, యువకులు
- బహుమతులు అందజేసిన కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 3: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆదివారం ఉదయం నిర్వహించిన 5కే రన్‌కు భారీ స్పందన లభించింది. 5కే రన్‌లో పాలుపంచుకున్న యువతీ, యువకుల్లో ఉత్సాహం, ఉల్లాసం కనిపించింది. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా, నేతన్నచౌక్, కొత్తచెరువు, చంద్రంపేట మీదుగా తిరిగి అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగింది. 5కే రన్‌లో ఓపెన్ కేటగిరిలో రాహుల్, బాలయ్య, సురేష్, (వీర్నపల్లి), విజయ్‌కుమార్, వకీల్ (రుద్రంగి), రజనీకాంత్, రాజు(ఎల్లారెడ్డిపేట), వినోద్‌కుమార్(రంగినేని ట్రస్టు, సిరిసిల్ల), మహిళల కేటగిరిలో హారిక, మౌనిక, విశాల, మౌనిక (తంగళ్లపల్లి), పోలీస్ విభాగంలో దేవరాజు(ఏఆర్ హెడ్‌క్వార్టర్), శంకర్ (ఎల్లారెడ్డిపేట), రవికుమార్ (మీడియా) విజేతలుగా నిలిచారు. విజేతలకు కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు, 13 సైకిళ్లు అందజేశారు.

● యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

మాదక ద్రవ్యాలను నిర్మూలించి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 5కే రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యుతనేనన్నారు. అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టేసుకుంటున్నారన్నారు. భావిజీవితానికి అవరోధంగా నిలుస్తున్న మత్తు పదార్థాలను సమాజాం నుండి పూర్తిగా నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరు నడుం బిగించాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాలను నియంత్రించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడంలో భాగస్వామ్యం కావాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై అనారోగ్యం పాలవుతూ బంగారు భవిష్యత్తును కోల్పోవడమే కాకుండా ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతలారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తుపదార్థాలను నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డీ-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధుల పాత్ర అంత్యంత కీలకమని, యువత గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల బారిన పడితే కలిగే అనర్థాలపై మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. 5కే రన్ నిర్వహణకోసం కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు భీం శర్మ, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, కరుణాకర్, శ్రీనివాస్, కిరణ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


5కె రన్‌లో పాల్గొన్న ఎస్పీ, చిన్నారులు


విజేతలకు సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

'బిర్లా ఓపెన్ మైండ్స్'లో చదరంగ పోటీలు



చదరంగం ఆడుతున్న బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యార్థులు

కరీంనగర్ రూరల్, మార్చి 3: బిర్లా ఓపెన్‌మైండ్స్ పాఠశాలలో అంతర్గత చదరంగ పోటీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పాఠశాల ఆధ్వర్యంలో అంతర్గత చదరంగ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు విభాగాల్లో గ్రేడ్ (1,2,3), గ్రేడ్(4,5,6), గ్రేడ్ (7,8,9) వేరువేరుగా పోటీలను నిర్వహించగా వంద మంది విద్యార్థుల్లో పోటీల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, కరీంనగర్ జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంకటి కనకయ్య, పాఠశాల చెస్ కోచ్ అనూప్, పాఠశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.

7న మంత్రి పొన్నంకు సన్మానం



మాట్లాడుతున్న రాచకొండ సత్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 3: బీసీ సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 7న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తలపెట్టిన ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ కుల గణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. దీనికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఈనెల 7న ఇందిరాగార్డెన్‌లో సన్మానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులు కడారి ఐలయ్య, మెతుకు సత్యం, వొడెల వీరేశం, మాడిశెట్టి భాస్కర్, గడప కోటేశ్, రామచందర్, బషీర్, ఆది మల్లేశం, జక్కని సంపత్, గొడిశెల రమేశ్, దుబ్బాక రమేశ్, నితిన్, రణదీర్‌సింగ్ రాణ, జక్కం పుల్లయ్య, రాచమల్ల రాజు, పల్లే నారాయణ, దొగ్గలి శ్రీధర్, అనుమగండి శ్రీనివాస్‌ర గరిగె కోటేశ్వర్, శ్రీధర్‌రాజు, నర్సింగోజు శ్రీనివాస్, సత్యనారాయణరాజు, ఎంఆర్ ప్రసాద్, సిరిశెట్టి రాజేశ్, బొల్లం లింగమూర్తి, రాధారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 3: పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు సంఘటితంగా ఈకార్యసాధనకు పోరాడాల్సిన అవసరముందని అన్నారు. గత ప్రభుత్వంలో మున్నూరుకాపు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులుగా ఎంతో మంది ఉన్నప్పటికీ మున్నూరు కాపు కార్పొరేషన్‌ను సాధించుకోలేక పోయామని అన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మ రాధాకృష్ణ, నలువాల రవీందర్ పటేల్, సత్తినేని శ్రీనివాస్, సమన్వయకర్త బొల్లం లింగమూర్తి, గాండ్ల రమేశ్, శ్రావణ్, వివిధ జిల్లాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పండిత పామరులను రంజింపజేసేదే ఉత్తమ కవిత్వం

కరీంనగర్ కల్చరల్, మార్చి 3: పండిత పామరులను రంజింపజేసేదే ఉత్తమ కవిత్వం అని ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్ కోర్టు, జూనియర్ సివిల్ జడ్జ్ పి సరళరేఖ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయ సాహితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో పాటు స్త్రీలు సమానంగా రాణించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి మేజర్ రేళ్ళ సంజీవ్, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య, వెగ్గలం ఉషశ్రీ, నూగూరి నాగవేణి, ఆది విజయలక్ష్మి, చిందం సునీత, కట్లా ఝాన్సి, కొమురోజు మాధవి తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన

కరీంనగర్ టౌన్, మార్చి 3: కరీంనగర్ 33వ డివిజన్ భగత్‌నగర్ భగవతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భారత దేశం కావాలంటే పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో భగవతి స్కూల్ ప్రిన్సిపాల్ రమణారావు పాల్గొన్నారు.

● **కరీంనగర్ రూరల్:** ఆసిఫ్‌నగర్ సబ్‌సెంటర్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమలమనోహర్, స్పెషలాఫీసర్ రంజిత్ కుమార్, డాక్టర్ మౌనిక, డాక్టర్ వనజ, కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం స్వేత పాల్గొన్నారు.

● **మానకొండూర్:** పోలియోరహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. మానకొండూర్ పీహెచ్‌సీ పరిధిలో 3,240 పిల్లలకు గాను 3,093 మంది, వెల్ది పీహెచ్‌సీ పరిధిలో 1,683 మంది పిల్లలకు గాను 1,553 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, వైద్యులు శిల్ప, అలేఖ్య, మైత్రీ, రాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మానకొండూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, హుజూరాబాద్‌లో..

● **శంకరపట్నం:** మండలంలోని అన్ని గ్రామాల్లో కేశవపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **చొప్పదండి:** మండలంలో మొత్తం 28 చోట్ల వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. రుక్మాపూర్‌లో ఎంపీపీ చిలుక రవీందర్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంసీహెచ్‌పీవో జువేరి, ఎంపీవో రాజ్‌గోపాల్‌రెడ్డి, మండల వైద్య అధికారి శైలేందర్, డాక్టర్ షేక్ మసరత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **గంగాధర:** మండల వ్యాప్తంగా ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు 3,713 ఉండగా 3,643 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ జాకీర్ తెలిపారు. ఇటుక బట్టీలు, గ్రానైట్, కటింగ్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న కూలీల పిల్లలు 102 మందికి చుక్కలను వేసినట్లు ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 34 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

● **ఇల్లందకుంట:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఐదేళ్ల లోపు 1,746 మంది పిల్లలకు పోలియో వ్యాక్సిన్ వేసినట్లు మెడికల్ ఆఫీసర్ తులసిదాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పావని, ఎంపీటీసీ కుమార్, సీహెచ్‌వో శ్యామల, విజయశ్రీ, హెల్త్ అసిస్టెంట్ అజీజ్ పాల్గొన్నారు.

● **వీణవంక:** వీణవంక ప్రాథమిక కేంద్రం పరిధిలో 1,652 మంది పిల్లలకు, చల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో 1,486 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వరుణ, శ్రీకీర్తన పాల్గొన్నారు.

● **తిమ్మాపూర్:** మండలంలోని మహాత్మానగర్ గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ డీడబ్ల్యూవో సరస్వతి పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాలో ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యవర్గం

కరీంనగర్ టౌన్, మార్చి 3: నగరంలోని పీవీ నర్సింహారావు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హెచ్.రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండా రవీందర్‌తోపాటు ఇతర కార్యవర్గాన్ని ఓటింగ్ పద్దతిలో ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న దుబ్బాక రమేశ్

సుభాష్‌నగర్, మార్చి3: చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రజక సంఘం జిల్లా గౌవర అధ్యక్షుడు కొత్తకొండ రాజయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. రజకులకు పింఛన్లతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'తెలంగాణ కోసం వినోద్‌కుమార్ పదవీ త్యాగం'

కరీంనగర్ టౌన్, మార్చి 3: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రం కోసం 16 ఏళ్ళ క్రితం ఎంపీ పదవికి త్యాగం చేసిన మహోన్నత నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్ తన ఎంపీ పదవికి రాజీనామా చేసి పదహారేళ్ళు అవుతున్న సందర్భంగా వీడియో విడుదల చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ద్యావ మధుసూదన్‌రెడ్డి, సంపత్‌గౌడ్, వంశీధర్‌రెడ్డి, సాయికృష్ణ, ఓంకార్, శ్రీను, శ్రావణ్, రాజశేఖర్, అజయ్, రమేశ్, విజేందర్‌రెడ్డి, సతీష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో విజిటర్స్ షెడ్‌ను ఆధునీకరించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, మార్చి 3: మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉన్న విజిటర్స్ షెడ్డును ఆధునీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా ఇందులో షెల్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బెడ్స్, కుర్చీలు, లాకర్ సదు పాయం కల్పించాలని ఆదేశించారు. రాత్రిపూట రోగుల కుటుంబ సభ్యులు ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో ఈ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్న పిల్లల వార్డుల్లోకి పేషంట్ల కుటుంబ సభ్యులను ఎపుడు పడితే అపుడు పంపించకూడదని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు సుజిత్‌కుమార్

కరీంనగర్ అర్బన్, మార్చి 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాను తగ్గించటం రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనామ్ చేసే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నగర మేయర్, ఎమ్మెల్యేలు స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే తాగునీటి సరఫరాలో కోత విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వేసవికాలంను దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలకు ప్రతిరోజు తాగునీటి సరఫరా చేయాలని, లేదంటే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మేయర్, ఎమ్మెల్యేలు కుట్రలు, కుతంత్రాలను మానేసి ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు దొంతి గోపి, కూడలి శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప భూమిని కాపాడాలని దీక్ష

కరీంనగర్‌రూరల్, మార్చి3: కొత్తపల్లి మండలం చింతకుంటలోని రాజీవ్ గృహకల్ప భూమి కబ్జా కాకుండా కాపాడాలని నివాసితులు రిలే దీక్షలు చేపట్టారు. మూడు రోజులుగా సాగుతున్న రిలే దీక్షలు ఆదివారం ముగిశాయి. ఈ దీక్షల్లో కల్లెపల్లి శంకరయ్య, కెస్వప్ప, కర్నాల శ్రీనివాస్, ఎర్ర కనకయ్య, పుల్యాల రాంరెడ్డి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు గుర్రం జాషువా పురస్కారం

కరీంనగర్ కల్చరల్, మార్చి3: హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో నగరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రచయిత వైరాగ్యం ప్రభాకర్ గుర్రం జాషువా పురస్కారం అందుకున్నారు. పురస్కారాన్ని డాక్టర్ బిక్కి కృష్ణ, డాక్టర్ పెద్దింటి యోహాను చేతుల మీదుగా అందుకున్నారు.

టెట్‌లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 3: టెట్ పరీక్షలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్‌లో ఓసీ అభ్యర్థులు 90 మార్కులు సాధించాలన్నారు. తద్వారా ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా 75 మార్కుల కటాఫ్ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఇందిరాపార్కు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

బంగారు పతకం సాధించిన కొత్తపల్లి విద్యార్థి

గణేష్‌నగర్, మార్చి 3: శాతవాహన విశ్వవిద్యాలయ ఫలితాల్లో కొత్తపల్లి పట్టణానికి చెందిన బదర్ జహర అనే విద్యార్థి ఎంఎస్సీ బాటనీలో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం సాధించింది. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జయంతి అభినందించి పతకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర అధ్యాపకులు నర్సింహమూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో జాతీయవాద ప్రభావం కీలకం

కరీంనగర్ టౌన్, మార్చి 3: సోషల్ మీడియాలో జాతీయవాద ప్రభావం కీలకమని ఆర్ఎస్ఎస్‌కు చెందిన పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో సోషల్ మీడియా సంఘమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ జర్నలిస్టు సురేశ్ కొచ్చాటిల్ మాట్లాడుతూ వాస్తవాలను సోషల్ మీడియా ద్వారా అందరికి తెలుపాల్సిన బాధ్యత జాతీయవాదులైన ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు నిరంజనాచారి, ఎలగందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో గరుడ హోమం

కరీంనగర్ రూరల్, మార్చి 3: కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ భక్త హనుమాన్ దేవాలయంలో ఆదివారం గరుడ హోమం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు ఆలయ కమిటీ ఏర్పాటు చేసి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమలో ఆలయ అర్చకులు జగన్నాథం విష్ణుశర్మ ఆధ్వర్యంలో పూజారులు గరుడ హోమం, ఆలయ నిర్మాణానినిక పూజ చేశారు.

అలయన్స్‌క్లబ్ భగత్‌నగర్ కార్యవర్గం

సుభాష్‌నగర్, మార్చి3: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ భగత్‌నగర్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూరి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గీకుల ఆంజనేయులు, కోశాధి కారిగా భోగ నగేష్, పీఆర్‌వోగా గుడాల కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, చీకోటి శ్రీనివాస్‌గాంధి పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కరీంనగర్ క్రైం, మార్చి 3: పేషెంట్స్‌లేని సమయాల్లో అంబులెన్స్‌ల డ్రైవర్లు ఎమర్జెన్సీ సైరన్ వాడకూడదని కరీంనగర్ ట్రాఫిక్ సీఐలు పర్శ రమేష్, కరీముల్లాఖాన్‌లు అన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేషెంట్లు లేకుండా సైరన్ వేసుకుని వెళుతున్న అంబులెన్స్‌ను పట్టుకుని ఈ చలాన్ ద్వారా జరిమానా విధించారు. తనిఖీలలో ఎస్ఐలు ఇషాక్, నీలవేణి రాజు, శనిగల శ్రీకాంత్ పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన యువకులు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 3: మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన పలువురు యువకులు అయోధ్యలో కొలువుదీరిన బాలరాముడిని దర్శనం చేసుకునేందుకు ఆదివారం బయలుదేరారు. ఈ మేరకు వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు కంకణాల రమేష్‌రెడ్డి కాషాయ జెండా ఊపి సాగనంపారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ చేయూత

హుజూరాబాద్‌రూరల్, మార్చి 3: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బూత్ అధ్యక్షుడు పంచ కోటి రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన కొద్దిరోజుల వ్యవధిలోనే భార్య మృతి చెందటంతో వారి పిల్లలు అనాథలుగా మారారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రంగాపూర్‌కు వచ్చిన ఎంపీ కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయారు. మృతుడి కుటుంబంలోని పిల్లలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు మృతుడి కుమార్తె వివాహం నిమిత్తం రెండు లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఆదివారం ప్రజాహిత కార్యక్రమం పట్టణంలో జరగగా మృతుడి పిల్లలకు చెక్కును రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ సమక్షంలో అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

గౌడ యువజన సంఘం కార్యవర్గం

చొప్పదండి, మార్చి 3: చొప్పదండి గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా బొమ్మగాని రంజిత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా పుదరి మధు, ప్రధాన కార్యదర్శిగా బొడిగె సాయికృష్ణ, బొడిగె శ్రావణ్, ఉపాధ్యక్షులుగా గుర్రం సాయికృష్ణ, బొడిగె శ్రీనివాస్, కోశాధికారిగా బొడిగె ఒంగంరాజు, బుర్ర హరీష్, కార్యదర్శులుగా మణిచంద్ర, పొన్నం శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మేడి రాకేష్, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్, చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా జాగిరి సాయిగణేష్, శ్రీకాంత్, సాయిచందు, సాయికుమార్, రమేష్‌లతో కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు.

సీతారామ లక్ష్మీనృసింహ ఆలయంలో బహిరంగ వేలం ప్రకటన

తిమ్మాపూర్, మార్చి 3: మండలంలోని నల్లగొండలోని సీతారామ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 2024 సంవత్సరము జాతర సందర్భంగా వివిధ రకాల అమ్మకాల కోసం ఈనెల 11న సోమవారం ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలము నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణధికారి ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయలు, లడ్డు, పులిహోర అమ్ముకునే హక్కు కోసం డిపాజిట్ సొమ్ము 50వేల రూపాయల చొప్పున, ప్యాలాలు, పుట్నాలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకేనే హక్కు కోసం డిపాజిట్ సొమ్ము 10వేల రూపాయల చొప్పున నగదు రూపంలో చెల్లించాలని తెలిపారు. దీనికి కాల పరిమితి మార్చి 16 2024 నుంచి మార్చి 30వ తేది వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ప్రతి వేలమునకు డిపాజిట్, షెడ్యూల్ ఫారం వంద రూపాయలు చెల్లించి షెడ్యూలు ఖరీదు చేసి వేలము పాటలో పాల్గొనలని తెలిపారు. వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

హుజూరాబాద్, మార్చి 3: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్ పట్టణంలో ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ వరకు కవాతు చేశారు. అంబేద్కర్ వద్ద ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు స్థానికులు పూలు చల్లి స్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు గొడవలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐ రాజు, అసిస్టెంట్ కమాండర్ బిశ్వరంజన్‌స్వాహా, రబీంద్రరోషన్, పుజారీ, నారాయణ, ఆర్ఐ సురేష్, ఏఎస్ఐ రాంమూర్తి, అవినాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, హుజూరాబాద్‌లో స్వాగతం పలుకుతున్న ఏసీపీ

● **మానకొండూర్‌లో..**

మానకొండూర్: మానకొండూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాపిడ్ ఆక్సన్ ఫోర్స్ సిబ్బంది కవాత్ నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దబూబుష్టిలో పెట్టుకొని ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మానకొండూర్‌లోని చెరువు కట్ట వద్ద నుంచి తూర్పు దర్వాజ బస్టాండ్ వరకు కవాత్ నిర్వహించారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, ఆర్ఎఎఫ్, స్థానిక పోలీసులు ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం, మార్చి 3, మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన న్యాలపట్ల పర్శరాం సరోజనల కుమారుడు సాయిపవన్ వివాహం అనూషతో కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీణవంక, మార్చి 3: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76వ సంవత్సర పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దాదపు 48 సంవత్సరాల క్రితం తాము చదివిన బడిలో ఒకరికిఒకరు ఆత్మీయ పలకరింపుల మధ్య తమ మధురస్మృతులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువలను ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల పరిసరాలు కలియ తిరుగుతు తమ అనుబంధాలు స్మరించుకు న్నారు. ఇటీవల తోటి విద్యార్థి మృతి చెందగా వారి కుటుంబానికి ఇరువైవేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పూర్వఉపాధ్యాయులు కె మాధవరెడ్డి, గంగాడి లింగారెడ్డి, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు మహకళ రామ్‌గోపాల్‌రెడ్డి, మాడ మాల్లారెడ్డి, యల్ల సుధాకర్‌రెడ్డి, జయప్రద, రాజయ్య, జగదీశ్వర్, జయప్రకాశ్, శ్రీనివాస్, కనకయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పరుపుల దుకాణంలో అగ్ని ప్రమాదం

మానకొండూర్, మార్చి 3: మండలంలోని చెంజర్లలో గల ఓ పరుపుల దుకాణంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసీఫ్ ఖాన్ అనే వ్యక్తి చెంజర్ల లో పరుపులను తయారు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. పరుపుల షాపులో అగ్ని ప్రమాదం సంభవించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేస్తున్నారు. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఆడబిడ్డల తల్లిదండ్రులకు వైస్ ఎంపీపీ బాసట

- 30 మంది అమ్మాయిల పేరుపై రూ. 5,016 చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న వైస్ ఎంపీపీ

తిమ్మాపూర్, మార్చి 3: ఆడబిడ్డల తల్లిదండ్రులకు వైస్‌ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి బాసటగా నిలిచారు. మండలంలోని రేణికుంట గ్రామంలో పుట్టిన ఆడబిడ్డలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో వైస్‌ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి తన సొంత ఖర్చుతో వారి పేరున సొంతంగా 5,016రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే కార్యక్రమాన్ని మా ఊరు మహాలక్ష్మి పేరుతో పథకాన్ని ఆదివారం గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 30మంది ఆడబిడ్డలకు 5016 రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేసిన ల్యాగల వీరారెడ్డి వాటిని సంబందించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12.6.2022 నుంచి రేణికుంట గ్రామానికి చెందిన కుటుంబంలో కూతురు జన్మిస్తే 5016రూపాలయలను ఫిక్స్ డిపాజిట్ చేసి వారి కుటుంబాలకు సంబంధిత పత్రాలను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాకుండా గ్రామంలోని మూడు మహిళ సంఘాలకు 50 కుర్చీలను ల్యాగల వీరారెడ్డి వితరణ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలుక అనిత అంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గన్నేరువరం ఎస్ఐగా తాండ్ర నరేష్



గన్నేరువరం, మార్చి 3: గన్నేరువరం మండల ఎస్ఐగా తాండ్ర నరేష్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ చందా నరసింహారావు సీటీసీ సెంటర్‌కు బదిలీ కాగా, ట్రాన్స్‌కోలో విధులు నిర్వహించిన నరేష్ గన్నేరువరం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

సైదాపూర్, మార్చి 3: ఈ నెల 10 కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మానం, గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సైదాపూర్ మండల కేంద్రంలో మండల స్థాయి గౌడ కులస్థుల సమాశం జరిగింది. ఈ సమాశేశానికి మఖ్య అతిథిగా హాజరైన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మాన కార్యక్రమానికి గౌడ కులస్తులు అధికసంఖ్యలో కదలి రావాలన్నారు. అనంతరం గౌడ కులస్తుల ఆత్మీయ సమేశనం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పొన్నం శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, రాజ్‌కుమార్, రాజు, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అవగాహన సదస్సు

వీణవంక మార్చి 3: మండలంలోని చల్లూరులో నెహ్రూ యువ కేంద్ర ఆదర్శ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ వెంకట రాంబాబు మాట్లాడుతూ ప్రతీ పౌరుడు బాధ్యతగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

మానకొండూర్, మార్చి 3: బీజేపీ ప్రకటించిన మొదటి జాబితాలో కరీంనగర్ ఎంపీ స్థానానికి బండి సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంపై బీజేపీ మండల ఆధ్వర్యంలో ఆదివారం మానకొండూర్‌లో సంబరాలు నిర్వహించారు. నాయకులు ఆధ్వర్యంలో బ్యాండ్ వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు బాస్కరాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బండి సంజయ్‌కుమార్‌ను మొదటి జాబితాలో ప్రకటించడంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. ఆయన గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు కంది రాజిరెడ్డి, వ్యాట లక్ష్మారెడ్డి, వెల్మరెడ్డి రాజేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: త్వరలో జరగబోయో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బీజేపీ ప్రకటించిన మొదటి జాబితాలోనే తిరిగి ఎంపీ బండి సంజయ్ పేరును ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకుంటు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు గడ్డం అరుణ్, పబ్బ తిరుపతి, కిన్నెర అనిల్, బోనాల మోహన్, జోగిరెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గంగాధర, మార్చి 3: చొప్పదండి నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ వివాహానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కొంకటి శేఖర్ వివాహం గంగాధరకు చెందిన మాలతీతో ఆదివారం గంగాధరలో జరిగింది. ఈసందర్భంగా హాజరైన ప్రవీణ్‌కుమార్,మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు నూతన దంపతులను దీవించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.